క్లుప్తంగా

నేడు తెలంగాణ రన్

జడ్చర్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలియజేశారు. సోమవారం ఉదయం 6గంటలకు అంబేడ్కర్ విగ్రహం నుంచి క్రాస్‌రోడ్డు వరకు రన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రన్ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ హాజరవుతున్నట్లు వివరించారు. అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

5 రోజులు సెలవులను పొడిగించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎండల తీవ్రత అధికంగా ఉన్న కారణంగా స్కూళ్ల సెలవులను మరో 5 రోజుల పాటు పొడిగించాలని వినియోగదాల సంఘం జిల్లా అధ్యక్షుడు అడమ్స్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సెలవులను 5 రోజుల పాటు పొడిగించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. వేసవి సెలవులు ముగించుకుని సోమవారం నుంచి స్కూళ్లు తిరగి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉందని దీంతో పిల్లలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన కుట్టు శిక్షణ

జడ్చర్ల టౌన్: ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మూడునెలలుగా పట్టణంలో ఇస్తున్న కుట్టు శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి హైకోర్టు సూపరింటెండెంట్ అంజనీకుమారీ, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిల హాజరై సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న మహిళలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వహకురాలు బాలమణి, సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, వార్డు కౌన్సిలర్ సతీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సమయపాలన తప్పనిసరి

మహమ్మదాబాద్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం చేసేందుకు అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థులకు అన్నిరకాల వసతులు, పరిశుభ్ర వాతావరణం కల్పించాలని మండల విద్యాధికారులు అంటున్నారు. మండల వ్యాప్తంగా 4 ఉన్నత, 5 ప్రాథమికోన్నత, 45 ప్రాథమిక, రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. కాగా అన్ని పాఠశాలల్లోనూ సోమవారం విద్యార్థులు వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్నారు. ఉపాధ్యాయులు కూడా సమయ పాలన తప్పకుండా పాటించేలా ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ జీహెచ్‌ఎంలు తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి వెంకటయ్య పేర్కొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలి



మరికల్: మాదాసి, మాదారి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్న మల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే మాదాసి కురువుల సభకు సంబంధించి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో చేర్చాలని దశాబ్దం పైగా పోరాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు రాములు, తిరుపతయ్య, అశోక్, ఆనంద్, శ్రీను, మల్లేష్, మల్లయ్య, సుదర్శన్, జగదీశ్‌లు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరిస్తాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని వడ్డెరుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బాదం రామస్వామి ఆడిటోరియంలో ఆదివారం వడ్డెర సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు అశోక్ టాకీస్ చౌరస్తా నుంచి ఆడిటోరియం వరకు భారీ ర్యాలీగా స్వాగతం పలికారు. అనంతం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, నాయకులు జూపల్లి భాస్కర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, వడ్డెర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసర్ల వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాసర్ల భూమయ్య, వడ్డెర ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రంగయ్య, ఒబ్లాయపల్లి సర్పంచ్ చంద్రకళ వెంకట్ స్వామి, గువ్వగోని రాములు, పీట్ల యాద య్య, పీట్ల కథలయ్య, ఉషన్న, దండుగుల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిష్ట వేసిన సమస్యలు

- నగం వరకే నిర్మించిన పెద్దకాల్వ
- ఓపెన్ ప్లాట్లలో చెత్తాచెదారం, మురుగు
- పలుచోట్ల మట్టిరోడ్లే గతి

22వ వార్డులో జనాభా: 6,490
ప్రధాన వీధులు: భగీరథకాలనీ, నాగేంద్ర నగర్, బీకేరెడ్డికాలనీ (కొంత భాగం), మధురానగర్, మైత్రీనగర్, కృష్ణానగర్

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోనే అత్యధిక జనాభా కలిగిన 22వ వార్డులో ఎన్నో సమస్యలు నెలకొన్నాయి. మైత్రీనగర్, కృష్ణానగర్, నాగేంద్ర నగర్, మధురానగర్‌లో సగం వరకు మట్టిరోడ్లే ఉన్నాయి. ఎక్కడికక్కడ ఓపెన్ ప్లాట్లన్నీ కంపచెట్లు, మురుగు, చెత్తా చెదారంతో నిండిపోయాయి. ఇక పెద్దచెరువు సమీపం వరకు బీకేరెడ్డికాలనీ విస్తరించింది. షాషాబ్‌గుట్టచౌరస్తా నుంచి భగీరథకాలనీకి వెళ్లే బీటీరోడ్డు మధ్యలోని మలుపు వద్ద రెండు వైపులా ఇటీవల కురిసిన వర్షాల ధాటికి కోసుకుపోయి ధ్వంసమైంది. ఈ కాలనీ చివరలో సీసీరోడ్డు పక్కన మిషన్ భగీరథ పథకం వాల్వ్ గుంత ధ్వంసమైంది. రాత్రివేళ ఏమరుపాటుతో అటువైపు వెళితే అందులో పడే ప్రమాదం పొంచి ఉంది. ఈ చెరువు కింది భాగంలో మైత్రీనగర్ విస్తరించగా పెద్దకాల్వ ఈ కాలనీ మీదుగా ప్రవహిస్తుంది. దీనిని సగం వరకు పక్కాగా నిర్మించి వదిలేశారు. వర్షాకాలంలో ఇది నిండి చుట్టుపక్కల ఇళ్ల వరకు వరదతో పాటు మురుగు రావడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ కాలనీలోని గల్లీ రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మెయిన్ రోడ్డుకు లింక్ కలపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మధురానగర్ ఆటోస్టాండ్ సమీపంలో ఆరు నెలల క్రితం వరకు రెండు విద్యుత్ 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవి. ఆ తర్వాత అందులో ఒకటి షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. అప్పటి నుంచి ఓవర్‌లోడ్‌తో తరచూ చుట్టుపక్కల ఇళ్లలోని బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి ఈ కాలనీలోకి వెళ్లే మార్గంలో కుడివైపు పెద్ద మురికిగుంత ఉంది. అక్కడి క్రాసింగ్‌లో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా అందులో పడే ప్రమాదం పొంచి ఉంది. భగీరథ కాలనీలో అన్నిచోట్ల సీసీరోడ్లు నిర్మించినా అక్కడక్కడా దెబ్బతిన్నాయి. కృష్ణానగర్‌చౌరస్తా నుంచి భగీరథ కాలనీచౌరస్తా వరకు బీటీరోడ్డు ఉన్నా వంద అడుగులకొక స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీంతో ఆగి.. ఆగి వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. మధ్యలోని ముఖ్యకూడలి వద్ద కంకర తేలి ధ్వంసమైంది. కృష్ణానగర్‌లో ఒకచోట రాగి, సిల్వర్ కోసం కొందరు వ్యక్తులు తరచూ ఇళ్ల మధ్యే పాత కరెంటు వైర్లు కాల్చివేస్తున్నారు. అలాగే పాత సామగ్రిని కొనుగోలు చేసి బహిరంగ ప్రదేశంలో వేస్తున్నారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు వచ్చి హెచ్చరించినా పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.


కృష్ణానగర్‌లోని గల్లీలో మట్టిరోడ్డు


న్యూమైత్రీనగర్‌లో ..


మెయిన్ రోడ్డు నుంచి మధురానగర్‌కు వెళ్లే దారిలో పెద్ద మురికిగుంత

సీసీరోడ్లు నిర్మించాలి



మా కాలనీలో ఎక్కువగా మట్టిరోడ్లే దిక్కయ్యాయి. పలుచోట్ల డ్రెయినేజీలు నిర్మించినా లింక్, సీసీరోడ్లు ఏర్పాటు చేయలేదు. పెద్దకాల్వను పూర్తిస్థాయిలో పక్కాగా నిర్మించాలి. వర్షా కాలంలో అది నిండి చుట్టుపక్కల ఇళ్లవరకు వరద వస్తోంది. మొదలే మట్టిరోడ్లు కావడంతో నడవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఓపెన్ ప్లాట్లలో సర్కారు–మురికి తుమ్మ చెట్లు ఏపుగా పెరిగాయి. పాములు సంచరిస్తుండటంతో భయమేస్తోంది. రోడ్లు ఊడ్చడానికి నెలకోసారి మాత్రమే పారిశుద్ధ్య కార్మికులు వస్తున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి.

– సత్యం, న్యూమైత్రీనగర్

ఇబ్బందులు పడుతున్నాం



మా కాలనీలోని కొందరు వ్యక్తులు ఇళ్ల మధ్యన ఉన్న బహిరంగ ప్రదేశంలో తరచూ పాత కరెంట్ వైర్లు కాల్చేస్తున్నారు. దట్టమైన పొగ, కార్బన్ గాలిలో కలిసి చుట్టుపక్కల వ్యాపిస్తోంది. దీంతో అనారోగ్యం బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. అలాగే ఎక్కడబడితే అక్కడ పాత సామగ్రి పడేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశాం. ఇటీవల వారు వచ్చి బాధ్యులను హెచ్చరించినా ప్రయోజనం దక్కలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విజయలక్ష్మి, గృహిణి, కృష్ణానగర్

రూ 1.50 కోట్లతో పనులు చేపట్టాం



ఈ మూడున్నరేళ్ల కాలంలో రూ.1.50 కోట్లతో వివిధ పనులు పూర్తి చేయించాం. భగీరథకాలనీచౌరస్తా నుంచి షాషాబ్‌గుట్ట శివాలయం వరకు బీటీ రోడ్డు విస్తరించనున్నాం. దీని కోసం టెండర్ పూర్తయింది. త్వరలోనే పనులు మొదలవుతాయి. వార్డు మధ్యలో నుంచి వెళ్తున్న పెద్ద కాల్వను మొత్తం నిర్మించడానికి రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.రెండు కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు ఈపాటికే టెండర్లు పిలిచారు. అలాగే రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తాం.

– వడ్ల రష్మిత, కౌన్సిలర్, 22వ వార్డు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవాబుపేట: పింఛన్ పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో దివ్యాంగులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు వెంకటేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్, రవి, శంకర్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

నవాబుపేట: మండల పరిధిలోని రేకులచౌడాపూర్, ఊరంచుతండాల్లో ఇద్దరు లబ్ధిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. లబ్ధిదారులు శంకర్‌నాయక్‌కు రూ.75వేలు, రాములుకు రూ.1.5లక్షలు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత బీదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రైవేట్‌లో అత్యవసర చికిత్స చేసుకున్నప్పటికీ వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డబ్బులు అందించి ఆదుకుంటున్నామని అన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ



రాజాపూర్: మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో మూడురోజులుగా కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు పోతురాజుల విన్యాసాలు ఎంతో అలరించాయి. కోటమైసమ్మకు మహిళలు బోనాలను సమర్పించారు. గ్రామ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల కోసం గ్రామానికి ఆడపడుచులు, బంధుమిత్రులు తరలి రావటంతో కోలాహలం నెలకొంది.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులతో ఎస్పీ వెంకటేష్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్పీ వెంకటేష్‌రు. జిల్లా కేంద్రంలో శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ కరాటే మాస్టర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని తెలిపారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకదిర నర్సింలు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ప్రశాంత్, ఆకారపు నరేందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా కవులు కె.లక్ష్మణ్‌గౌడ్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ 'శిథిలమే శిఖరం' కె.లక్ష్మణ్‌గౌడ్ 'నూతన శకం' కవితలను చదివారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు జిల్లా కవులను శాలువా, నగదుతో సత్కరించారు.



సమ్మేళనంలో కవితను చదువుతున్న డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్

జాతీయ రహదారి వెంట నిర్మాణాల తొలగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్–రాయచూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167) వెడల్పులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎనుగొండలో ఆదివారం నాలుగు ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తొలగించారు. వాస్తవానికి వెడల్పు పనులు రెండేళ్ల క్రితమే చేపట్టినా వీటిని అప్పట్లో అలాగే వదిలేశారు. ఇటీవలే బాధితులకు వేరేచోట పట్టాలతో పాటు పరిహారం చెల్లించడంతో ఇప్పుడు పూర్తి చేశారు. కాగా బాధితులెవరూ అడ్డుకోలేదని ఈ పనులు సాఫీగా జరుగుతున్నాయని టీపీఓలు లక్ష్మీపతి, శ్రీకాంత్ తెలిపారు.


ఎనుగొండ వద్ద ఇళ్లను జేసీబీతో తొలగింపజేస్తున్న అధికారులు

కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు


బెల్టులు పొందిన విద్యార్థులతో డీఎస్పీ మహేష్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్ పాష ఖాద్రీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం వార్షిక బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మహేష్ ప్రతిభచాటిన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. కరాటేలో రాణించాలని కోరారు. మంచి ఫిట్‌నెస్, ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, బ్లాక్‌బెల్టు అర్ష్ జమీల్, సీనియర్ విద్యార్థులు మహేష్, ఖాజాపాష తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపనుల నిలిపివేత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రలోని పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తున్న విషయం విదితమే. ఇందులోభాగంగా కట్టపై నుంచి బీకేరెడ్డికాలనీ వైపు ఉన్న 40 ఫీట్ల సీసీరోడ్డును కాస్తా 80 ఫీట్లకు విస్తరించనున్నారు. అయితే ఈ రోడ్డును ఆనుకుని ఓ వ్యక్తి కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతుండగా రెండు పిల్లర్ల పనులను తాజాగా అధికారులు నిలిపివేయించారు.

ఎఫ్‌ఎంసీజీ ఆధ్వర్యంలో రక్తదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పాలమూరు బ్లడ్‌బ్యాంక్‌లో ఆదివారం ఎఫ్‌ఎంసీజీ మార్కెటింగ్ సేల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు స్వామి, ఎఫ్‌ఎంసీజీ సభ్యులు నరసింహ, శ్రీకాంత్‌రెడ్డి, సైదులు, బాలు రామయ్య, నరేష్‌గౌడ్, రమేష్, సర్దార్, గోపాల్, రాజు, అంజి, అనిల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఎఫ్‌ఎంసీజీ సభ్యులు

తెలంగాణకు ఊపిరి పోసింది కవులే


కవులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్నమంత్రి శ్రీనివాస్ గౌడ్, కలెక్టర్ రవినాయక్ తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది కవులేనని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శిల్పారామంలో సాహిత్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అస్థిత్వం, ప్రగతి అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలమూరు జిల్లా కవులు, కళాకారులకు పుట్టినిల్లు లాంటిదని అన్నారు. ఉత్తమ కవులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నర్సింహ, అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.


కోలాటం వేస్తున్న యువతులు

బీభత్సం సృష్టిస్తున్న వానరాలు


జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో సంచరిస్తున్న కోతులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో వానరాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా సర్దార్ వల్లబ్‌భాయి పటేల్ నగర్, రైల్వేస్టేషన్, పాతబజార్ ప్రాంతాలలో వీటి బెడద అధికమయ్యింది. పదుల సంఖ్య నుంచి వందల్లోకి వృద్ధి చెందడంతో నిత్యం ప్రయాణికులకు కష్టాలు తప్పటం లేదు. రైల్వేస్టేషన్ సమీపంలో పాడుబడిన రైస్‌మిల్‌ను కోతులు అడ్డాగా చేసుకుని చెట్లపై నివాసం ఏర్పరచుకున్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు స్టేషన్, ఎస్‌వీపీనగర్‌లలోకి గుంపులుగా వస్తూ రైల్వేస్టేషన్‌లో దర్జాగా తిరుగుతున్నాయి. ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తుంటాయి. చేతి రుమాలు మొదలుకుని సంచులు, పండ్లు, బిస్కట్లు ఇలా ప్రయాణికుల చేతిలో ఏం ఉన్నా లాక్కెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా రెండు గుంపులుగా ఏర్పడి దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల సమస్యపై కాలనీవాసులతోపాటు స్టేషన్ అధికారులు జిల్లా కలెక్టర్, మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. కోతులతో వేగలేక పోతున్నామని అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పలు సందర్భాల్లో వాటి దాడిలో చాలామంది గాయపడ్డారని అంటున్నారు. మరికొందరు ఇళ్ల వద్ద ఉన్న చెట్లను కొట్టేయ్యాల్సి వచ్చిందని పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, కోతులను పట్టణానికి దూరంగా అడవి ప్రాంతాల్లో వదిలి వేయాలని కోరుతున్నారు.

తరలించేందుకు చర్యలు తీసుకుంటాం



రైల్వేస్టేషన్ ప్రాంతం, ఎస్‌వీపీ నగర్‌తోపాటు పాతబజార్, శ్రీరాంనగర్‌ల నుంచి కోతుల బెడద విషయంపై ఫిర్యాదులు వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లటంతోపాటు మా పాలకమండలిలో చర్చించి అటవీప్రాంతంలోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారులతో మాట్లాడి వారికి సమస్యను వివరించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

–దోరేపల్లి లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

కాలు విరగొట్టుకున్నా



కోతులు ఒక్కసారిగా మీదకు రావటంతో గోడపైనుంచి దుకాల్సి వచ్చింది. ఆ సమయంలో నా కాలు విరిగి నాలుగు నెలలు ఇంటికే పరిమితం అయ్యా. మొదట్లో ఒకటిరెండు కోతులు మాత్రమే వచ్చేవి. కొంతకాలంగా వందల సంఖ్యలో వస్తున్నాయి. కొంచెం ఆదమర్చినా ఇళ్లు గుల్ల చేస్తున్నాయి. వాటిని ఎక్కడికైనా దూరంగా వదిలేస్తే బాగుంటుంది.

–లోకేష్, ఎస్‌వీపీనగర్

అధికారులు స్పందించాలి



కోతులు పెద్ద సంఖ్యలో వచ్చి ఇంటిముందు ఉన్న చెట్టుపై ఆటలాడుతూ మమ్మల్ని ఇబ్బందులు పెట్టేవి. అవి ఒక్కసారిగా మీదకు వస్తుంటే భయపడి పరుగెత్తబోయి కాలు విరగొట్టుకున్నా. ఇంటిముందు ఉన్న చెట్టును కొట్టేయ్యాల్సి వచ్చింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

–మాధవి, ఎస్‌వీపీనగర్,

అధికారులందరికి విన్నవించాం

కోతుల సమస్యపై జిల్లా కలెక్టర్ వరకు అధికారులందరికి విన్నవించాం. సాయంత్రం పూట అవి చేసే భీభత్సం అంతా ఇంతా కాదు. వందల సంఖ్యలో వచ్చి రేకులపై ఎగురుతూ దుంకుతుంటే ఆ శబ్దానికి భయం వేస్తోంది. అంతేకాక ఇక్కడికి వచ్చే ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాటిని అడవిలోకి వదిలితే బాగుంటుంది.

–ముఖేష్‌ఆనంద్, రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్, జడ్చర్ల